మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
7 PM
తెలుగు డైలీ
శుక్రవారం 16 అక్టోబర్ 2026
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

# ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది



- మిథున్ రెడ్డి కాన్వాయ్ పై దాడి ఒక రాక్షస క్రీడ..
- పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి జరిగిందన్న జగన్
- సీఎం చంద్రబాబే హింసను ప్రోత్సహిస్తున్నారని తీవ్ర ఆరోపణ
- ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు పాల్పడుతోందని విమర్శ

**అమరావతి**

రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై పుంగనూరులో దాడి జరిగిందంటూ ఆ పార్టీ అధినేత జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తూ పాలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వెళుతున్న వైసీపీ అభ్యర్థులను, నాయకులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభాపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయని, - మిగతా3లో



## పుంగనూరులో దాడుల వెనుక కుట్రకు నేనే ప్రత్యక్ష సాక్షిని

- పుంగనూరు ఘటనల వెనుక పెద్దిరెడ్డి కుటుంబం కుట్ర ఉందన్న రామచంద్రయాదవ్
- స్థానిక ఎన్నికలు ముగిసే వరకు వారిని జైల్లో పెట్టాలని డిమాండ్
- నామినేషన్ల వేళ వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణ
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు, కొనసాగుతున్న ఉద్రిక్తత

**చిత్తూరు**

చిత్తూరు జిల్లా పుంగనూరులో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా జరిగిన దాడుల వెనుక వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం కుట్ర ఉందని బీసీవై (దీజ్) పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ దాడులకు పూర్తి బాధ్యత వారిదేనని, ఎంపీ మిథున్‌రెడ్డి కుట్రకు తానే ప్రత్యక్ష సాక్షినని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షలో - మిగతా3లో

# నామినేషన్ల వేళ టెన్షన్.. టెన్షన్

- పుంగనూరులో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య రాళ్ల దాడి
- అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ
- నామినేషన్ల ప్రక్రియలో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు
- ఎంపీ మిథున్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందన్న వైసీపీ
- పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని అధికార పార్టీపై విపక్షం ఆరోపణ



**చిత్తూరు**

అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అటు రాయచోటిలో వాహనాలకు నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ లోక్‌సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. టీడీపీ కార్యకర్తలు తమ కాన్వాయ్‌ను అడ్డుకుని, నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారని వైసీపీ ఆరోపించింది. కర్రలు, ఇనుప రాడ్లతో వాహనాలపై దాడి చేశారని, - మిగతా3లో

# కల్వకుంట్ల కుటుంబాన్ని గతంలో తిట్టి.. ఇప్పుడు పొగడ్తలా?

- జీవన్ రెడ్డిపై అడ్లూరి లక్ష్మణ్ ఫైర్
- బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం
- పార్టీ మారగానే కల్వకుంట్ల కుటుంబం మంచిదైపోయిందా అని ప్రశ్న
- ఎండిన ఒక్క పొలమైనా చూపించాలని జీవన్ రెడ్డికి సవాల్



**హైదరాబాద్**

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారినంత మాత్రాన... ఒకప్పుడు ఆయన తీవ్రంగా విమర్శించిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు మంచిదైపోయిందా? అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ఈరోజు జగిత్యాల అర్బన్ కాలనీలో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్-స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి... కేసీఆర్, కేటీఆర్‌తో పాటు కల్వకుంట్ల కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ఆరోపించిన జీవన్ రెడ్డి... ఇప్పుడు పార్టీ మారగానే వారంతా సత్యవంతులుగా - మిగతా3లో

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..

# చర్చలు చివరి దశలో ఉన్నాయి

- వీలైనంత త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల
- ఒప్పందం మొదటి దశ పూర్తయిందని, లీగల్ డ్రాఫ్ట్ సిద్ధమవుతోందని వెల్లడి
- ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం
- బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ సమావేశాల్లో వ్యాఖ్యలు





## పిల్లల సోషల్ మీడియా భద్రత..

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు

# కరువు కోరల్లోకి తెలంగాణ..!

## పంటలు ఎండేకాలం

## గుండెలు మండేకాలం..

- తెలంగాణను ఎల్‌నినో కరువు కోరల్లోకి నెట్టింది
- వర్షాభావం, ప్రాజెక్టుల్లో నీటి కొరతతో పంటలు ఎండిపోతున్నాయి
- విద్యుత్ సంక్షోభం, కరెంటు కోతలు సాగును దెబ్బతీస్తున్నాయి
- తాగునీటికి కూడా సమస్యలు నెలకొంటున్నాయి
- ప్రభుత్వం నీటి కోసం ప్రయత్నిస్తున్నా, రైతులు క్రాప్ హాలిడేకు సిద్ధపడాల్సి వస్తుందని హెచ్చరిస్తోంది.



**హైదరాబాద్**

పంటలు ఎండేకాలం – గుండెలు మండేకాలం. నీటి కొరతలు–ఎడాపెడా కరెంటు కోతలు.. తెలంగాణ డ్రాట్ కామ్. అవును.. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.. కరువు కోరల్లో చిక్కుకుంది. - మిగతా3లో



# రైతులను త్యాగాలు కోరడమా?

- ప్రభుత్వంపై కవిత విమర్శ
- ఎల్ నినో ప్రభావంపై రేవంత్ ప్రభుత్వం విఫలమైంది
- ముందస్తు హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణ
- వ్యవసాయ కూలీలకు రూ.12,000, జీవిత బీమా అందించాలని డిమాండ్

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శుక్రవారం 16 అక్టోబర్ 2026

# తాడిపత్రి లో నో టెన్షన్..!!

**తాడిపత్రి :** తాడిపత్రి పురపాలక సంఘ ఎన్నికల నామినేషన్ల తొలి రోజు ప్రక్రియ ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం 9 నుండి సాయంత్రం 3 గంటల వరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద ఒక్క చిన్న గొడవ కూడా జరగలేదు.

ఖాకీల ప్లాన్ వర్కౌట్: పోలీసు శాఖ అమలు చేసిన పకడ్బందీ ప్రణాళిక సత్ఫలితాలనిచ్చింది. డీఎస్పీ చంద్రశేఖర్ నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ వలయాకారంగా మోహరించారు. నామినేషన్ కేంద్రానికి వచ్చే ప్రతి దారిలో చెక్ పోస్టులు, రూట్ పార్టీలతో వాహనాలను తనిఖీ చేస్తూ అల్లరి మూకలను అడ్డుకున్నారు.

అభ్యర్థుల సహకారం: నామినేషన్ కు వచ్చిన అభ్యర్థులు పోలీసులు సూచించిన రూట్ మ్యాప్ ను కచ్చితంగా పాటించారు. నిర్ణీత సంఖ్యలోనే అనుచరులను తీసుకువచ్చి, ఎలాంటి నినాదాలు, హంగామా లేకుండా నామినేషన్ పత్రాలు సమర్పించి వెళ్లారు. దీంతో ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. డీఎస్పీ కామెంట్: తొలి రోజు ప్రశాంతంగా ముగియడం పట్ల డీఎస్పీ చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థులు, వారి అనుచరులు అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు. రానున్న రెండు రోజులు కూడా ఇదే స్ఫూర్తితో సహకరించి, తాడిపత్రిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# జలాశయంలో జల సమాధి..!!







**పెనుకొండ :** మండలం లో గొల్లపల్లి రిజర్వాయర్ లో పడి ఐదుగురు యువతులు గల్లంతైయారు. స్థానికులు, పోలీస్ లు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం పట్టణం లోని దర్గాపేట, ఇసుక వంకకు చెందిన అశ్విని (20),గాయిత్రి (45),పుష్ప(35), మనిష్(16)హాసిన్ (48) కలసి విహారయాత్రకోసం గొల్లపల్లి రిజర్వాయర్ ను చూడడానికి వెళ్లారు. అక్కడ జలాశయం లో నీళ్లు పుష్కలంగా వుండడంతో సమీపంలో చిన్న కుంట ఉండడంతో కుంట లోతు తక్కువ వగా ఉన్నదని ఒకరి వెనుక ఒకరు దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో కుంటలో పడి మరిణించారు.సరదాగా గడిపేందుకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న ఐదుగురు రిజర్వాయర్ లోమునిగి మరణించడంతో అలలతాకిడికి బయట కు కొట్టు కొచ్చారని స్థానికులు తెలిపారు.మృతుల కుటుంబాలలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయి

భారత్–అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్–ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## పిల్లల సోషల్ మీడియా భద్రత..

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ–ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.

## రైతులను త్యాగాలు కోరడమా?

ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు. రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 30 నెలలు గడుస్తున్నా ఇంకా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000 ఇచ్చే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే సమయంలో, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఏవైనా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## నామినేషన్ల వేళ టెన్షన్.. టెన్షన్

-మొదటిపేజీ తరువాయి

ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి. ఈ దాడి తనపై జరిగిన హత్యాయత్నమని వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, తమ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది. ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని డిమాండ్ చేసింది. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, అభ్యర్థులకు భద్రత కల్పించి ప్రశాంతంగా నామినేషన్లు వేసేలా చూడాలని కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో నెలకొన్న రాజకీయ వైరం ఈ ఘర్షణతో మరోసారి బయటపడింది.

## కరువు కోరల్లోకి తెలంగాణ..!

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా గ్రౌండ్‌లెవల్‌లో తిప్పలు చూస్తే ఇదే నిజమనిపిస్తోంది. దాదాపు ఏడాదిన్నరపాటు గడ్డుకాలమే అని స్వయానా క్యాబినెట్ మంత్రులే గొంతు చించుకుంటున్నారు. యుద్ధప్రాతిపదికన అప్రమత్తమైంది ప్రభుత్వం. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ముందడుగు పడింది. భారీ పంప్ మోటార్లు స్విచ్ ఆన్ చేసి తాగునీటి అవసరాల కోసం నార్లపూర్ రిజర్వాయర్‌లోకి ఆరు టీఎంసీల నీటిని విడుదల చేశారు మంత్రి జూపల్లి కృష్ణారావు. సోమవారం (అక్టోబర్ 12) నాగర్ కర్నూల్ జిల్లాలో అదొక పండగ వాతావరణం. బిరబిరా క్రిష్ణమ్మ పరుగులిడినట్టే అని జనం సంబరపడిపోయారు. కానీ, ఆ సెలబ్రేషన్ టైమ్స్ ఆ కాసేపే. తెల్లారేసరికి డామిట్ కథ అడ్డం తిరిగింది. విద్యుత్ సమస్యతో కొన్ని గంటల గ్యాప్‌లోనే మోటార్లు ఆగిపోయాయి. ఒక్కరోజులోనే ఉప్పొంగిన క్రిష్ణమ్మ.. చప్పున కిందకి ఇంకిపోయింది. కరెంట్ సమస్య తీరి, మోటార్లను మళ్లీ ఆన్ చేసినా నో యూజ్. భారీ స్థాయిలో నిరంతర సరఫరా ఉంటేనే నీటిని ఎత్తిపోసేంతటి శక్తి మోటార్లకు వచ్చేది. కానీ, గ్రిడ్ నుంచి ఆ రేంజ్‌లో విద్యుత్ సప్లయ్ లేదు. ఫలితం.. నీళ్లున్నా జనం దగ్గరికి చేర్చే మార్గం లేక.. చతికిలపడింది యంత్రాంగం. నిన్న అట్టహాసపు సీన్లు.. ఇప్పుడు మోటార్లు పనిచేయక ఆగిపోయిన నీళ్లు.

## పుంగనూరులో దాడుల వెనుక కుట్రకు నేనే ప్రత్యక్ష సాక్షిని

-మొదటిపేజీ తరువాయి

ఉన్న తాను రాత్రి పన్నెండు గంటల సమయంలో మేడపైకి వెళ్లగా, పక్కనే ఉన్న గెస్ట్ హౌస్ లో మిథున్ రెడ్డి తన అనుచరులు, గూండాలతో సమావేశమై ఈ దాడులకు వ్యూహరచన చేశారని ఆయన వెల్లడించారు. స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేసి, ఎన్నికలు ముగిసే వరకు జైల్లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపి, పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులందరినీ అరెస్ట్ చేయాలని కోరారు. చంద్రబాబుకు పెద్దిరెడ్డి కుటుంబంతో లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు.

### నామినేషన్ల వేళ రణరంగం

శుక్రవారం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజే పుంగనూరు రణరంగంగా మారింది. నామినేషన్ దాఖలు చేసేందుకు వైసీపీ నేతలు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి వచ్చారు. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో, ఎంపీ మిథున్‌రెడ్డికి సంబంధించిన వాహనాలు టీడీపీ కార్యకర్తలపైకి దూసుకెళ్లాయని, వైసీపీ శ్రేణులు టీడీపీ కార్యకర్తలపై దాడికి దిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దాంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### పోలీసుల రంగ ప్రవేశం, లాఠీఛార్జ్

ఘటనా స్థలానికి చేరుకున్న చిత్తూరు ఎస్పీ ధీరజ్ కొనుబిల్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాలను చెదరగొట్టేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేశారు. అనంతరం టీడీపీ, వైసీపీ నేతలను అక్కడి నుంచి పంపించివేసి, నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అయితే, టీడీపీ కార్యకర్తల నిరసనల మధ్య ఎంపీ మిథున్‌రెడ్డి చాలాసేపు నామినేషన్ల కార్యాలయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. పోలీసులు ఆయనను అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, బయట టీడీపీ శ్రేణులు ఆందోళన కొనసాగించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదే తరహాలో తిరుపతిలోని నామినేషన్ కేంద్రం వద్ద కూడా ఘర్షణలు చెలరేగినట్లు సమాచారం. మొత్తంగా, నామినేషన్ల తొలిరోజే జరిగిన ఈ హింసాత్మక ఘటనలతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## కల్వకుంట్ల కుటుంబాన్ని గతంలో తిట్టి.. ఇప్పుడు పొగడ్తలా?

-మొదటిపేజీ తరువాయి

కనిపిస్తున్నారా? అని నిలదీశారు. విద్యుత్ సమస్యలపై సాధారణ ఆరోపణలు చేయడం కాదని, నీళ్లు లేక ఎండిపోయిన ఒక్క పొలాన్నయినా చూపించాలని జీవన్ రెడ్డికి సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, జీవన్ రెడ్డిని కేబినెట్‌లోకి తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని, ఎల్ నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరాను రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది

-మొదటిపేజీ తరువాయి

మిథున్ రెడ్డి భద్రతా సిబ్బందికి గాయాలైనట్టు వైసీపీ వర్గాలు ఆరోపించాయి. అనంతరం అధికారులు ఆయన్ను నామినేషన్ కేంద్రంలోని ఒక ప్రత్యేక గదికి తరలించారు. ఈ దాడి సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని వైసీపీ ఆరోపించింది.

## మారెమ్మ ముందు...కర్ణాటక భరతనాట్యం..!!

**గోరంట్ల :** గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీ మారెమ్మ దేవి సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయంలో గోపూజ, అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా భక్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### శాశ్వత అన్నదానానికి రూ.10,116 విరాళం

ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన కార్యక్రమానికి ఎస్ఏపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ రూ.10,116 విరాళంగా అందజేశారు. భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

### భక్తులకు అన్నదాన కార్యక్రమం

ఆలయానికి విచ్చేసిన భక్తులకు కాంతమ్మ, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, జయమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు.

### గోశాలకు ఆవు విరాళం.. దాతలకు సత్కారం

శ్రీ మారెమ్మ దేవి గోశాలకు చిన్నపరెడ్డిపల్లికి చెందిన సరస్వతి, వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆవును విరాళంగా అందజేశారు. గోసేవకు, ఆలయ అభివృద్ధికి అన్నదానకర్తలకు ముందుకు వచ్చిన దాతలను శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ తరఫున డాక్టర్ బి. దేవిరాజు స్వామి ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి అభినందించారు.

### ఆకట్టుకున్న కర్ణాటక చిన్నారుల భరతనాట్యం

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కర్ణాటకకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారుల నృత్య ప్రదర్శనతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణం నెలకొంది. అమ్మవారి ఉత్సవాల్లో భక్తి కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఏపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ, పెనుకొండ ఏజీపీ భాస్కర్ రెడ్డి, పెనుకొండ సీనియర్ జర్నలిస్ట్ జాకీర్, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వెంకటేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎలక్షన్ డ్యూటీ లో అలర్ట్ గా ఉండండి..!!

**పుట్టపర్తి :** శుక్రవారం పుట్టపర్తి ఎండీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లాలోని రిటర్నింగ్ ఆఫీసర్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు మరియు ఇతర అధికారులకు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియపై క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చారు.నోటిఫికేషన్ విడుదల నుండి నామినేషన్ల స్వీకరణ మరియు నామినేషన్ల పరిశీలన వరకు పాటించాల్సిన నిబంధనలను వివరించారు.పోలింగ్ సిబ్బందికి శిక్షణ, పోలింగ్ సామగ్రి పంపిణీ, పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడం మరియు తగు జాగ్రత్తలు తీసుకోవడంపై మార్గదర్శకాలు అందజేశారు.మొదటి నుంచి చివరి వరకు కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, ఫలితాలను ప్రకటించే విధానాన్ని వివరించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాలు అధికారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఎలక్షన్ రూల్ బుక్‌ను క్షుణ్ణంగా చదువుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను, అనగా జిల్లా పరిషత్ సీఈఓ ని లేదా జిల్లా ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ అయిన పి.డి. డ్వామా విజయప్రసాద్ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.పీఎంఎస్ – పోలింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్) మరియు ఎలక్టోరల్ ఎలక్షన్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టళ్లలో ఎప్పటికప్పుడు రిపోర్టులను ఖచ్చితంగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకట సుబ్బయ్య, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్,పీడీ డ్వామా విజయప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులు, ప్రత్యేక అధికారులు మరియు ఎంపీడీవోలు (హోదా కలిగిన వారు) అందరూ పాల్గొని శిక్షణను శ్రద్ధగా స్వీకరించారు.